

# క్యాన్వాస్

## వేదుల శకుంతల

సరిగ్గా ఒక గంటసేపటి నుంచి... తదేకంతో తపస్విలా ఆ చిత్రాన్ని చూస్తున్నాడు. అందులో తొణికిసలాడే మనోహర రూప లావణ్యానికి ముగ్ధుడవుతూ... అది చిత్రించిన చిత్రకారుని హృదయస్పందనకి... జోహారులర్పిస్తూ నిల్చుండిపోయాడు శ్రీధర్.

'భావుకుడు, కవి' అయిన శ్రీధర్ సౌందర్యారాధనలో ఒక యోగిలా అనుభూతి పొందుతూ ఉంటాడు. ' ఆ సృష్టికర్త ప్రేరణకి ఈ సుందర రూపం ఊపిరి పోసుకుని చిత్రకారుని కుంచెలో నుంచి జాలువారిందా?' అన్నంత అద్భుతంగా రంగులు దిద్దేడు సుమా? అనుకున్నాడు శ్రీధర్.

ప్రముఖ చిత్రకారుడు అని పేరుపొందిన 'లహరి'గారి చిత్రాల ఎగ్జిబిషన్‌లో... శ్రీధర్ ప్రతి చిత్రాన్ని చూస్తూ 'సుందరి' అన్న చిత్రం దగ్గర గంట సేపటి నుంచి అలా ఉండిపోయాడు.

నిజమే! ఈ జవ్వని అందం అమోఘంగా ఉంది. లేత సుకుమారంగా ఉన్న ఆమె చేతి వేళ్ళు... పాల చెక్కిళ్ళపైన ఆనించుకుని ఒయ్యారపు చూపులతో పసిడి మెరుగుల మెడని అర్ధచంద్రాకారపు ఒంపుతో ఆకసాన కాంతులీనుతున్న-దినకరుణ్ణి గమనిస్తోంది!

ఆ గమనిక ఏమైవుంటుంది? అది ఉదయ సంధ్యా? సాయం సంధ్యా? నీలినీడల సోయగంతో అపురూప కళాఖండం సృష్టించిన ఆ చిత్రకారుణ్ణి మరొక్కసారి ప్రశంసించి నెమ్మదిగా కదిలేడు శ్రీధర్.

సరిగ్గా అప్పుడే గుర్తు వచ్చింది ఎదురింటి హేమ!

చాలా మందే వచ్చారు ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి. కొందరు జంటలుగా వచ్చారు. వృద్ధులు కొందరైతే టీనేజ్ వాళ్ళు కొందరున్నారు. రకరకాల వయస్సులలో చాలామందే కనిపిస్తున్నారు. అంతమందికి కళాహృదయం ఉందో లేదో గానీ కాలక్షేవంగానైనా వాళ్ళు వచ్చి చూస్తుండొచ్చును. తను ఎప్పుడైనా సరదాపడి 'సువ్వారా రాజ్యం!' అని భార్యని పిలిస్తే - 'అబ్బ నాకు ఓపిక లేదండి. చంటిదానికి ముక్కు కారుతోంది. నాల్గు కస్తూరి మాత్రలు వేసి, ముక్కుకి విమ్ము పట్టించాను. వెర్రిమొద్దు! ఇప్పుడే పడుకుంది. దాన్ని నిద్రలేపి భుజాన వేసుకుని రాలేనండి! ఆ బడుద్ధాయి ఆటలకి పోయేడు వీధిలో ఉన్నాడో...? ఒక ఆటా? ఒక లోకమా? గోలల దగ్గర్నుంచి బిళ్ళంగోడు... క్రికెట... ఫుట్‌బాల్... అన్ని ఆటలు ఆడందే ఇల్లు చేరడు. మధ్యలో మోకాలి చిప్పో మోచేతులో గీరుకుపోతేనో... నుదురు బొప్పి కట్టేనో వస్తాడు. మందో మాకో వేయించుకుని మళ్ళీ పరిగెత్తుతాడు. వాడంతట వాడు రావల్సిందేగాని మనం పిలిస్తే రాడు. వెధవాయి! రెండవ క్లాసు చదువుకే.. బోలెడు పెద్దవాణ్ణయానని చెప్తున్నాడు...' రాజ్యం దండకం అలా సాగిపోతూనే ఉంటుంది. తను వీధిలోకి వచ్చేస్తూ ఉంటాడు శ్రీధర్ - ఇవాళ అలాగే జరిగింది. ఇక చచ్చినా

దేనికి పిలవకూడదనుకుని తనే వచ్చాడు.

అసలు ఏదైనా ఆర్ట్ వచ్చిన పిల్లని చేసుకోవాలనుకున్నాడు. కుదర్లేదు. కనీసం కళాహృదయం ఉంటే బాగుండుననుకున్నాడు. ఉహూ! కళకీ ఆవిడకీ ఆమడదూరం!! పోనీ ఇల్లు తీర్చి దిద్దటంలో శ్రద్ధ, సౌందర్యం ఒలికిస్తే ఎంత ఆనందమో అని ఆశించాడు- ఛ! ఛ! అదీ చేతకాదని తెలిసి నీళ్ళు కారిపోయాడు.

ఓసారి ఓ అందమైన కేలండర్ తెచ్చి డ్రాయింగ్ రూంలో తగిలించేడు. మర్నాడు అది మధ్య గదిలోకి మారింది.

ఇదేమిటి ఈ కేలండర్ ఇక్కడి నుంచి ఎందుకు తీసేవ్? అని అడిగేడు 'హవ్వ! మరీ అంత బరితెగించినట్టు ఆ బట్టలు వేసుకున్న ఆ బొమ్మేమిటండీ? ఎవరొచ్చినా చూస్తే బాగుండదు! మన వెధవాయి రెప్పలార్చకుండా చూస్తున్నాడు. అందుకే మధ్య గదిలోకి మార్చేసేను. అక్కడ అంత వెలుగు ఉండదుకదా?' అంది రాజ్యం.

'పోనీ ఆ సిమెంటు అటక మీద తగిలించకపోయావా? కనబడకుండా ఉండేది?' అన్నాడు ఒళ్ళుమండి.

'నిజమే సుమా? తోచలేదు. రేపు తగిలిస్తాలెండి' అంది.

'నోరు ముయ్యి! రేపు తగిలిస్తావా? అంత చక్కని బొమ్మలో నీకు బరితెగింపు కనిపించిందా? ఆ ఫోటో తీసిన వాడు నిన్ను అడిగి తీయాల్సింది. నీకు అసలు మనసులేదు. దేన్ని అందమంటారో? దేన్ని బరితెగించటమంటారో? గ్రహించలేని ఎడ్డి మనిషి? నీకు చెప్పటం నాదే బుద్ధి తక్కువ. ఇక మీదట నేను పెట్టిన వస్తువు ఏమైనా మార్చేవంటే ఏం చేస్తానో నాకే తెలియదు!' అంటూ మండిపడి మధ్య గదిలో ఉన్న కేలండర్ మళ్ళీ ముందు గదిలోకి మార్చేసేడు, శ్రీధర్! కళ్ళ నీళ్ళు పెట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది రాజ్యం.

అదిగో ఆనాడు ఆ సమయంలో హేమ గుర్తుకు వచ్చింది!!

అసలు రాజ్యం అన్న పేరే నచ్చలేదు శ్రీధర్‌కి.

'అమ్మాయి పేరేమిటండీ?' అని పెళ్ళి చూపులనాడు అడిగేడు తన తండ్రి.

ఆ పేరు ఏమై వుంటుందో? అని వినడానికి ఆత్రుతపడ్డాడు శ్రీధర్.

'చెప్పమ్మా చెప్పు' అని వాళ్ళ నాన్న అమ్మ ఒత్తిడి చేసేక నోరు తెరచి చెప్పింది

'వెంకట నాగశాయి రామభద్రికా లక్ష్మీ రాజ్యం'

శ్రీధర్ వెంటనే కర్చీఫ్‌తో చెంపలు అద్దుకున్నాడు.

ఇలవేల్పులు - ఇష్టదేవతలు - నక్షత్ర నామాలు అన్నీ కలుపుకుని పేర్లు పెట్టడం తెలుసు గనుక - ఇదీ అదేరకం అని సరిపెట్టుకున్నాడు.

పెళ్ళి పత్రికలో మాత్రం కుదించి 'రాజ్యం' అని వేయించమన్నాడు.

కాపరానికి వచ్చాక 'రాజ్యం' అనే పిలుస్తున్నాడు.

ఒకసారి ముచ్చటపడి 'రాజ్యశ్రీ' అన్నాడు. 'ఛ! అదేమిటీ? నా పేరులో ఏ పొట్టి పేరుతో పిలిచినా నాకిష్టమే. కానీ మరొక అక్షరం కొత్తది కల్పినా నాకు ఇష్టం ఉండదు అంది. శ్రీధర్‌కి ఇంక వాదించాలనిపించలేదు. ఆశ తీరనప్పుడు అలసట పడటం అనవసరం అనిపించింది. 'రాజ్యం' అన్న పిలుపునే అలవాటు చేసుకున్నాడు.

ఇల్లు సర్దుకోవటం, చీర కట్టుకోవటం - అలంకరించుకోవటం - సరదాలు పంచుకోవటం - అందమైన వస్తువులు కొనితేవటం లాంటి ఎన్నో అందమైన భావ తరంగాలు గుండె లోతుల్లో... వరద పొంగులా తెళ్ళుతూ వుంటాయి, శ్రీధర్‌కి!

'రాజ్యాన్ని' తన హృదయ సామ్రాజ్యానికి మహారాణిని చేసి అతీతమైన ఆనంద లోకాల్లో విహరించాలని ఎంతగానో తపన పడుతూ వుంటాడు శ్రీధర్!

కానీ... ఉహూ!! ఆమె తనకన్నా దిగువ చేతికి అందనంత దూరంగా ఉండి పోతోందని ఆరాటపడుతూ ఉంటాడు. తనొక అందమైన మండపంలో నిల్చుంటే- ఆమె తన క్రింద ఎంతో లోతులో వున్న లోయలో మిగిలిపోతోందని దుగ్ధపడుతూ వుంటాడు. ఎంతో ప్రయాసపడి ఆమె చేయి అందుకుని పైకి లాగాలని తన సరసన నిలబెట్టుకోవాలనీ ఆకాంక్షిస్తుంటాడు. ఆ ప్రయత్నం ఫలించనప్పుడు - ఫలించదని తెలిసినప్పుడు గాలి వానలో తడిసిన పక్షి రెక్కలార్చుకుంటూ చెట్టుకొమ్మల్లో దాగినట్టు - నిరాశని, మనసు పొరల్లో దాచుకుంటూ ఉంటాడు-

'రాజ్యం! చీర కుచ్చెళ్ళు చక్కగా పెట్టుకోరాదూ?' - అంటే

'బాగుందండీ! పని చేసేటప్పుడు ఎలా కుదురుతుంది?' అనేస్తుంది.

ఇద్దరు పిల్లలు పుట్టేటప్పటికే లావై - పొట్ట ముడతలు పడ్డ రాజ్యాన్ని 'బొత్తిగ శరీర పోషణ తెలియని ఎడ్డిమనిషి!' అనుకుని విసుక్కుంటాడు. నల్లని జాకెట్టు వేసుకున్నప్పుడు - పొట్టయిపోతున్న బ్లౌజు వేసుకున్నప్పుడు - శుభ్రత తెలియని 'అడవిమాలోకం' అని గింజుకుంటాడు.

అలాంటప్పుడే హేమ గుర్తువస్తుంది!

రాజ్యం ఎలా వుంటే బాగుంటుందో - తన భావుకతకీ - రసాస్వాదనకీ ఏ తీరున, మారాలో - ఊహల్లో మలచుకుంటున్న రోజుల్లో... ఎదురింట్లో కొత్త దంపతుల జంట కొత్తగా అద్దెకి దిగేరు - ఆసక్తిగా... చూసేడు శ్రీధర్!

రెండు రోజుల్లో కొన్ని విషయాలు తెలిసేయి.

కొత్త జంటలా ఉన్నా... వాళ్ళకి పెళ్ళై రెండేళ్ళు అయిందనీ ఇంకా పిల్లలు పుట్టలేదనీ... తెలియగానే అబ్బురపడ్డాడు.

ఆ అమ్మాయి పెద్ద అందంగా లేదు. అయినా మంచి కళగా ఉంది! రాజ్యం బాగా తెల్లగా వుంది. కానీ వెలిసిపోయినవాటంగా వుంటుంది. ఆ అమ్మాయి తనకున్న కళకి మరింత మెరుగులు పెట్టుకుంటుంది. ఎంతో నైపుణ్యంతో కట్టు, బొట్టు తీరు, హుందాతనం ఒలికిస్తుంది! భర్తని ఆఫీసుకి పంపే వేళ వీధి గ్రిల్ వరండాలో నిల్చుని అతను స్కూటర్ స్టార్ట్ చేయగానే అలవోకగా చేయి ఊపుతుంది.

రెండు మూడుసార్లు ఆ సీను శ్రీధర్ కంట పడింది.

ఓ చక్కని రూపం మనో కాన్వాస్ మీద పదిలపరుచుకున్నాడు.

ఆ అమ్మాయి స్థానంలో రాజ్యాన్ని ఊహించుకోబోయేడు. 'వద్దులే! బాత్‌రూంలో బట్టలకి సబ్బు రాస్తూ వుంటుంది. చీర సగం తడిసి, జడ పాయలు విడిపోయి, పాదాల కింద నుంచి సబ్బు నురగ కారుతూ - నుదుట నుంచి కారుతున్న చెమట బిందువులతో... ఊ! ఆ అవతారానికీ, ఈ అమ్మాయికీ పోలికా?- వద్దులే' అని నీర్సపడిపోయాడు. ఆ అమ్మాయి పేరు హేమ అని మరో నాల్గు రోజులకి తెలిసింది. ఎంత చక్కటి పేరు?! కనీసం పేరు పెట్టుకోవటంలోనైనా అందం ఎరుగని అత్తమామల్ని తిట్టుకున్నాడు. పైగా ఆ పేరులో మరొక కొత్త అక్షరం కూడా చేర్చటానికి ఇష్టపడని రాజ్యాన్ని - మింగేయాలన్నంత కోపంతో చూసేవాడు.

మధురమైన భావం కలిగినా చక్కని దృశ్యం చూసినా... శ్రీధర్‌కి హేమ గుర్తు వస్తుంటుంది! పొందిక, ఒద్దిక గల అమ్మాయి అనుకుంటాడు.

ఈ రోజు 'సంధ్యా సుందరి' చిత్రం చూసి బయటికి వస్తున్నప్పుడు హేమ గుర్తుకు వచ్చింది! నిజానికి ఆ చిత్ర సుందరి అంత అందమైంది కాదు కానీ, అందమైన ఊహలకి 'పొది'లా సంధించి వదిలే బాణంలా కొందరిలో ఆ ఆకర్షణ ఇతరులని ఆకట్టుకుంటుంది. హేమలో ఆ లక్షణం వుందనిపించింది!

ఎగ్జిబిషన్ హాల్లో నుంచి బయటికి వచ్చి వరండాలో వున్న కుర్చీల్లో ఒక కుర్చీ ఖాళీగా కనిపిస్తే- అందులో కూర్చున్నాడు శ్రీధర్!

మిగతా కుర్చీల్లో ఎవరెవరో కూర్చున్నారు. వస్తున్న వాళ్ళూ... చూసి వెళ్ళిపోతున్నవాళ్ళు మాట్లాడుకుంటున్న వాళ్ళూ... చాలా సందడిగా వుంది వరండా! ఆవరణలో స్కూటర్లు... కార్లు.. పార్కు చేసేవాళ్ళ దగ్గర వాచ్‌మేన్ రశీదులు ఇస్తూ... జాగ్రత్త పడుతున్నాడు - స్కూటర్ దిగుతూ కనిపించారు హేమ... ఆమె భర్తా!

'అనుకున్నా, మీరు వస్తారని అనుకున్నా' అని మనసులోనే అనుకున్నాడు శ్రీధర్. హేమ భర్తపేరు తెలియకపోయినా... ఆఫీసుకి వెళ్ళేముందు... ఒకటి రెండుసార్లు హేమ చేయి ఊపి వెళ్ళిపోయేక- తనకి 'హలో' అని విష్ చేశాడు. బదులుగా తనూ 'హలో' అన్నాడే తప్ప - అంతకు మించి పరిచయాలు పెరగలేదు.

ఇంతలో గేటులో నుంచి లోపలికి వస్తున్న తెల్ల మారుతి కనిపించింది. అందులో నుంచి దిగుతున్న 'బాస్'ని చూడగానే 'అమ్మో' అనుకున్నాడు శ్రీధర్. 'ఇతనికి ఇంత కళాహృదయం కూడానా?' అనుకుని ఇంక వెళ్ళిపోవడం మంచిది- అనుకున్నాడు. లేకపోతే "ఏమోయ్ ఫలానా ఫైల్ తయారైందా? మొన్న నేను ఇచ్చిన అక్కౌంట్స్ సరిచేసేవా?' అంటూ ఆఫీసు పరామర్శలు, ఆశీర్వచనాలు, ఇక్కడే గుమ్మరించేస్తాడు. అలా చేయటం అలవాటు! తను ఒక ఆఫీసర్‌ననీ, వీడు నా సబార్డినేట్ అనీ నల్గురికీ తెలియాలని ఆయన కుతూహలం! ఇదివరలో ఇతని వల్ల ఇలాంటి అనుభవం పొందిన తన కొలీగ్ రామ్మూర్తి తనకి చెప్పాడు - సినిమా థియేటర్‌లో కనిపించి - అడ్డమైన ఆఫీసు ప్రశ్నలు వేసి - భార్యతో అతను సినిమా చూడటానికి వచ్చిన ఆనందం కరిగించి పారేసి - జన్మలో మళ్ళీ ఆఫీసర్‌ని ఆఫీసులో తప్ప బయట ఎక్కడ కనిపించినా పారిపోవాలనిపించేలా చేసేడోయ్!' అని జాగ్రత్త. ఎక్కడైనా నీకు కనిపిస్తే పక్కకి తప్పుకో' అని హెచ్చరించాడు.

అది జ్ఞాపకం వచ్చి - వెంటనే కుర్చీలో నుంచి లేచి... స్తంభం చాటు నుంచి బయటికి జారుకున్నాడు, శ్రీధర్!

వారం రోజులు గడిచిపోయాయి.

ఆఫీసు పనిలో చాలా బిజీగా వున్నాడు. రాజ్యం

గొడవలో రాజ్యం ఉంది. అప్పుడప్పుడు హేమ ఆమె భర్త స్కూటర్ మీద షికారుకు వెళ్ళడాలు... బై... బై...లు చెప్పుకొంటున్న వైనాలు. కళ్ళకి కనిపిస్తూనే ఉన్నాయి. తీరిగ్గా చూసే టైములేదు. ఫైళ్ళు... పెండింగ్ కేసులు చూసుకోవటంతో అలసిపోతున్నాడు... ఈ మధ్య రాజ్యానికీ హేమకి బాగానే స్నేహం పెరిగింది.

ఒకరోజు ఆ హేమ అభిరుచుల్ని గురించీ... మరొక రోజు ఆ అమ్మాయి - వంటకాల గురించీ... ఇంకోరోజు హేమ కాలేజి చదువుని గురించి రకరకాల కబుర్లు చెప్తూ వుండేది. 'మా రాజ్యంలో మాత్రం హేమ నుంచి నేర్చుకున్న ఏ అభిరుచీ అనుభూతి కనిపించలేదు.' అనుకునేవాడు. రెండు మూడు నెలలు దాటిపోయాయి. "హేమకి ఐదో నెలట!" అంది రాజ్యం. 'ఓహో!' అన్నాడు. ఆఫీసు పనుల్లో కొంత భారం తగ్గింది! కాస్త వెసులుబాటు చిక్కింది.

ఒకరోజు ఇంటికి వచ్చేసరికి ఎదురింట్లో - సందడి! ముస్తాబై వచ్చిపోయే ముత్తయిదువులు కనిపించేరు.

ఇంట్లో రాజ్యం మంచి చీరతో కనిపించింది. కాళ్ళకి పసుపు-నుదుట కుంకుమ దిద్దిన పెద్ద బొట్టు. మెడలో గంధం పూత, తలలో మూరెడు పూలమాల... చంటిదాన్ని చంకన వేసుకొని ఉంది.

" ఏమిటి ఎదురింట్లో పేరంటమా?" అనడిగేడు కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ శ్రీధర్!

" ఆ! అదే! హేమకి శీమంతం! వాళ్ళమ్మగారు... అత్తగారు వచ్చారు. ఎంత విడ్డూరమండీ? ఈ హేమని ఎక్కడికీ పంపనన్నాట్ట అతను. తనూ వెళ్ళనందిట!? అందుకే వాళ్ళ పెద్దవాళ్ళే ఇక్కడికి వచ్చి ఈ శుభకార్యం జరిపిస్తున్నామని చెప్పేరు" అంటూ రాజ్యం రెండు బుగ్గలు నొక్కుకుంది.

శ్రీధర్‌కి విడ్డూరమనిపించలేదు. ' ఆహా ఒకే మాట! ఒకే బాట! భార్యాభర్త అంటే అలా ఉండాలి' అనుకున్నాడు.

"అంతేకాదండీ? పురుడు కూడా ఇక్కడ ఈ ఊళ్ళోనే పోసుకుంటుందిట! వాళ్ళమ్మ వాళ్ళు ఇక్కడికి వస్తారుట! ఇదేం అబ్బురం? ఆ అబ్బాయి అదేమాట! హేమా అదే పలుకుట!! వాళ్ళమ్మ - అత్తగారు బాధపడుతున్నారు. తొలి కాన్పుకి పుట్టింటికి తీసుకెళ్ళాలి. కానీ అల్లుడు ఒప్పుకోవటం లేదని చెప్పింది వాళ్ళమ్మ. పైగా వాళ్ళిద్దరూ ప్రేమించుకుని పెద్దల్ని ఒప్పించి పెళ్ళి చేసుకున్నారుటండీ?" అని రాజ్యం కళ్ళింతింత చేసి చెప్పింది.

శ్రీధర్ ఆశ్చర్యంగా చూసేడు.

'అదీ ఓ ఘనతే!! ఎంత ముచ్చటైన జంటో?' అనుకున్నాడు.

ఇంకా ఏదేదో చెప్తూనే - ఒక ప్లేట్లో మినప సున్ని ఉండ - పూతరేకు - బందరు లడ్డు - లాంటి స్వీట్లు మరొక ప్లేట్లో పకోడీలు పెట్టి "తీసుకోండి టీ ఇస్తాను." అంది.

ఆ స్వీట్లకన్నా వాళ్ళ ప్రేమాభిమానాల అనుబంధమే మరింత తియ్యగా అనిపించింది శ్రీధర్‌కి. ఎదురింట్లో సందడి తగ్గింది. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళారు.

రాజ్యం ఆ ఇంటి ముచ్చట్లు రోజుకో వింతలా వినిపిస్తోంది శ్రీధర్‌కి.

"అయ్యో మరీ చోద్యం! హేమా వాళ్ళాయన పుట్టబోయే పిల్లాడికో, పిల్లకో ఇప్పట్నుంచే బొమ్మలు కొని తెస్తున్నాడు-" అంది ఒకరోజు శ్రీధర్‌తో.

"వెర్రి ముఖమా! నువ్వు అర్థం చేసుకోలేవులే!" అన్నాడు.

రాజ్యం మూతి తిప్పి లోపలికి వెళ్ళిపోయింది.

"అదేంటి నాన్నా? వాళ్ళింట్లో చిన్న పాపలు లేరుకదా? మరి బొమ్మలతో ఎవరు ఆడుకుంటారు?" అని బాబిగాడు నవ్వేడు.

" ఏడిసేవ్ వెధవాయ్! వాళ్ళింట్లో కూడా ఒక చిన్నబాబు వస్తాడులే. నువ్వెళ్ళి ఆడుకో ఫో" అంటూ కసిరేడు శ్రీధర్.

శ్రీధర్ మనస్సులో గతం ఒక్కసారి రెపరెపలాడింది.

బాబు పుట్టేవుందు - తనూ ఎన్నో ఊహించుకున్నాడు. కానీ ఒక్కటీ సాగలేదు. రాజ్యం ఏడోనెలలో పురిటికి వెళ్ళింది - ఆపరేషన్ అయిందని - బాబు పుట్టిన ఐదో నెలదాకా పంపకూడదన్నారు - తర్వాత... వాళ్ళ తమ్ముడికి ఒడుగు అనీ... చెల్లి పెళ్ళి అని మొత్తం పది నెలలు అక్కడే వుంది- బాబు నిలబడి అడుగులు వేసేవేళకి ఇంటికి వచ్చింది- ఉయ్యాల వేసే అవసరం లేకుండా... నడక నేర్చుకుంటున్న బాబుకి చక్రాల బండి - గుర్రం బొమ్మ తేవలసి వచ్చింది - ఇప్పుడు ఈ చంటిదానికి ఎప్పుడు ఏదో ఒక రోగమే! నవ్వుతూ తుళ్ళుతూ ఉండే రోజులే తక్కువ! మన్ను తిన్న పాములా పడి వుంటుంది.

ఊహించేవన్నీ జరగవనీ - జరిగేవన్నీ ఊహించలేమని - ఓ కవిగారి పాటని పదాలు మార్చుకుని పాడుకుంటూ ఉంటాడు శ్రీధర్-

అనుకోకుండా వారం రోజులు క్యాంప్ డ్యూటీ పడింది శ్రీధర్‌కి.

ఆఫీసు పనా మజాకానా? వెళ్ళి తీరాలి. రాజ్యానికి జాగ్రత్తలన్నీ చెప్పేడు. " ఆ బాబిగాడ్ని వీధిలోకి వెళ్ళనీయకు. ఇదిగో చంటిదానికి ఒళ్ళు వెచ్చబడితే సందు చివర స్పెషలిస్టు దగ్గరికి తీసుకెళ్ళు, వంటింటి వైద్యాలు చేయకు" అన్నాడు.

"నేను అవన్నీ చూసుకుంటానులెండి. మీ ఆరోగ్యం జాగ్రత్త! ఊహల్లో తేలిపోతూ... భోజనం మానేయకండి. తెల్లవార్లు సిగరెట్లు ఊదేస్తూ నిద్రపోకుండా కూర్చోకండి" అన్నది.

"సరే సరే!" దీనికెంతసేపు తిండిగోల... నిద్ర ధ్యాసే తప్ప - మరో ఆలోచనరాదు - ఎన్నడైనా ఓ ఎక్స్‌కర్షన్ లాంటి ప్రోగ్రామ్ పెట్టుకుందామన్నా... డబ్బా నిండా జంతికలు, కారప్పూస... పిల్లలకీ దుప్పట్లు, దిళ్ళు, పెద్దలకీ సర్దుతుంది! అందుకే అలాంటి సరదాలు మానుకున్నాను' అని మనసులోనే అనుకున్నాడు శ్రీధర్!

వారం రోజుల క్యాంపులో ఉండి అన్ని పనులు పూర్తిచేసుకొని ఇంటికి వచ్చాడు శ్రీధర్. స్నానం చేసి టీ తాగి పేపర్ చూస్తున్నాడు.

రాజ్యం మౌనంగా వంట చేస్తోంది. సాయంత్రం ఆరు దాటింది.

ప్రతిరోజు ఏదో కబురు చెప్పే రాజ్యం ఇంత మౌనంగా ఉందేమిటా అనుకున్నాడు. రాత్రి భోజనం చేస్తున్నప్పుడు చెప్పింది-

" ఏమిటో అనుకుంటాంగానీ - అనుకున్నవన్నీ జరుగుతాయా?" ఉపోద్ఘాతంగా అంటున్న ఆ మాటలకి శ్రీధర్ ఆశ్చర్యంగా చూసేడు. తను అనుకునే మాట రాజ్యం అంటోందేమిటీ' అని.

"అవునండి - ఆ హేమావాళ్ళు ఎంత అన్యోన్యంగా ఉండేవారు? పురిటికూడా పుట్టింటికి పంపనన్నాడా? ఫ్! ఫ్! ఏమిటో అంతా విచిత్రం!!...'

''అబ్బ! సంగతేమిటో చెప్పు ననపెట్టకు'' విసుక్కున్నాడు శ్రీధర్.

" ఇంకా సంగతులు - సరిగమలు ఏముంటాయి? మొన్న మీరు క్యాంపు వెళ్ళినరోజు - ఆ హేమ తండ్రికి బాగులేదని టెలిగ్రాం వచ్చిందిట! ఆ అమ్మాయి వెళతానంటే - అతను వద్దన్నాట్ట! ఇద్దరు పేచీలు పడి మాటా మాటా అనుకున్నారుట! అంతా నీ ఇష్టమేనా అంటే - అవును నీ ఇష్టమా మరి? నేను మా వాళ్ళని ఎదిరించి చేసుకున్నాను అన్నాట్ట! నేనూ అంతేకదా? అని హేమ అందిట! ఇద్దరూ చెడామడా తిట్టుకుని - మా తమ్ముడికి జబ్బు చేస్తే నేను వెళ్ళలేదు కదా? అని అతను అంటే - నేను ఒద్దన్నానా అని హేమ వాదించిందిట! మొత్తం మీద ఇద్దరు ... సవాళ్ళు జవాబులు విసురుకుని - పెద్ద యుద్ధం చేసుకున్నారు - అందరం పరిగెట్టుకుని వెళ్ళాం! ఎవరి మాటా వినలేదు. తెగతెంపులు చేసుకుందామని ప్రతిజ్ఞలు పూని.. పెట్టె సర్దుకుని హేమ వెళ్ళిపోయింది. అతను తాళం బిగించి వాళ్ళ నాన్న దగ్గరికి పోయాడు. ఇక ముందు దారి ఏమిటో? ఏమి జరుగుతుందో?" అని రాజ్యం ఏకబిగిని చెప్తుంటే - శ్రీధర్ అవాక్కైపోయాడు - ఎలాగో భోజనం ముగించేడు.

రెండు రోజులు - ఎదురింటివైపు చూడాలనిపించలేదు. తాళం కప్పు మూగగా రోదిస్తోంది. ఆ తర్వాత చాలా మార్పు వచ్చింది శ్రీధర్‌లో.

అతని 'మనో క్యాన్వాస్' మీద చిత్రాలు మారిపోయాయి.

అతను ఇప్పుడు - రాజ్యంలో - ' ఆడమనిషి', ' ఎడ్డిమనిషి', ' ఎడ్డిమాలోకం' చూడటంలేదు! అమాయకత్వం - పసితనం - సహజత్వం చూడటం నేర్చుకుంటున్నాడు.

ఆనాటి 'సంధ్యాసుందరిలో'... సంధ్య మాయమై... ఉదయరాగం... కనిపిస్తోంది

శ్రీధర్‌కి - చూడటంలోనే కళాహృదయం ఉండాలి గానీ చూడబడేవారిలో కాదని శ్రీధర్ - క్యాన్వాస్ మీద రాసుకున్నాడు - హేమ గుర్తుకు రావటంలేదు!!!

## ఐయామ్ సెలక్టెడ్

ఇంటర్వ్యూ చేసే అతను అభ్యర్థితో ఇలా చెప్పాడు- 'నేను కొన్ని వర్డ్స్ చెప్తాను. నువ్వు వాటికి ఆపోజిట్ వర్డ్స్ చెప్పగలగాలి. అర్థమైందా?'

'అయింది సార్' చెప్పాడా అభ్యర్థి.

'గుడ్‌కి ఆపోజిట్ ఏమిటి?'

'బేడ్ సార్'

'హేపీ?'

'శాడ్'

'బ్యూటిఫుల్?'

'అన్ బ్యూటిఫుల్'

'అది రాంగ్ ఆన్సర్'

'అది రైట్ ఆన్సర్'

'గెటౌట్' కోపంగా చెప్పాడా అధికారి.

'కమిన్'

'యు ఆర్ రిజెక్టెడ్'

'ఐయామ్ సెలక్టెడ్'

- ఊహ